
శిథిలమవుతున్న బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల


తరగతి గదిలో పెచ్చులూడిపోయిన స్లాబ్


అసంపూర్తిగా నిలిచిన టాయిలెట్లు

ఫలితాల్లో ఫస్ట్.. వసతుల్లో లాస్ట్

శిథిలమవుతున్న బనిగండ్లపాడు ప్రభుత్వ కళాశాల భవనం

- అడ్మిషన్లకు విముఖత చూపుతున్న విద్యార్థులు
- సమయానికి నడవని ఆర్టీసీ బస్సులు..
- ఇబ్బందులు పడుతున్న పిల్లలు
- గతేడాది భట్టికి విన్నవించిన యాజమాన్యం, నిధుల మంజూరుకు హామీ

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడులో ప్రభుత్వ జూనియర్ కళాశాలను 1969–70 సంవత్సరంలో స్థాపించారు. కళాశాల ఏర్పాటుకు స్థానికుడు, మాజీ మంత్రి స్వర్గీయ శీలం సిద్దారెడ్డి కృషి ఎనలేనిది. నేడు ఈ కళాశాలలో నెలకొన్న సమస్యలు పట్టించుకున్న నాధుడే కరువయ్యాడు. ఇంటర్ మీడియట్ ఫలితాల్లో జిల్లాస్థాయిలో ఫస్ట్ (అగ్రగామి)గా ఉండగా వసతుల కల్పనలో మాత్రం లాస్ట్(చిట్ట చివర)గా మిగిలింది. గతేడాది ఇంటర్ ఫలితాల్లో కళాశాల జిల్లాస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.

విముఖత చూపుతున్న విద్యార్థులు..

కళాశాలలో భవన గదులన్నీ శిథిలం కాగా, టాయిలెట్స్ నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడంతో పాటు.. సమయానికి ఆర్టీసీ డీపో బస్సు సర్వీసులు నడపడం లేదు. దీంతో విద్యార్థులు కళాశాలలో చేరేందుకు విముఖత చూపుతున్నారు. ఫలితాల్లో ముందంజలో ఉన్నప్పటికీ అడ్మిషన్ల విషయంలో వెనుకబడుతుంది. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో 40మంది మాత్రమే విద్యార్థులు చేరారు. కళాశాల భవన మరమ్మతులకై ప్రభుత్వం రూ.20లక్షల నిధులు మంజూరు చేయగా.. అధికారులు తూతూ మంత్రంగా పనులు చేపట్టడంతో ఎవరికి ఉపయోగం లేకుండా పోయింది. ఇకనైనా నూతన భవనాలు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గతేడాది కళాశాలను సందర్శించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు స్థానికులు, అధ్యాపకులు నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేయగా, నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు.

కళాశాలలో నెలకొన్న సమస్యలు..

కళాశాల ఆవరణలోని 3 భవనాలుండగా అందులో 15 గదులున్నాయి. ఇవన్నీ శిథిలమవుతున్నాయి. వర్షం వచ్చిందంటే చాలు గదులు కురవడంతో పాటు స్లాబు పెచ్చులూడి కిందపడుతున్నాయి. ఇటీవల తరగతి గదిలో శ్లాబు పెచ్చులూడి కిందపడింది పెను ప్రమాదం తప్పింది. లేదంటే పిల్లల పైనే పడేది. 104మంది విద్యార్థులకు ఒక్క టాయిలెట్ మాత్రమే ఉంది. నిర్మిస్తున్న 3 టాయిలెట్లకు ప్రభుత్వం బిల్లులు చేయని కారణంగా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఉన్న ఒక్క టాయిలెట్‌ను బాలికలకు మాత్రమే కేటాయించారు. మిగతా బాలురు, అధ్యాపకులు బయటకి వెళ్లాల్సిందే. సైన్సు ల్యాబ్ గదులు కూడా పూర్తిగా శిథిలమై వర్షం కురవడంతో.. విద్యార్థులు ప్రయోగాలు చేయలేని పరిస్థితి నెలకొంది. కళాశాల చుట్టూ పిచ్చిమొక్కలు, కంప అలుముకుంది. విష కీటకాలు తరచూ వస్తున్నాయి.

సమయానికి రాని ఆర్టీసీ బస్సులు..

మధిర ఆర్టీసీ.. మధిర నుంచి వయా బనిగండ్లపాడు మీదుగా.. భీమవరం, బనిగండ్లపాడు గ్రామాలకు నడుపుతున్న బస్సులు కళాశాల సమయానుకూలంగా లేవు. ఈ రెండు రూట్లలో ఉన్న గ్రామాల నుంచే ఎక్కువ మంది విద్యార్థులు కళాశాలలో చదువుతున్నారు. దీంతో కళాశాలలో అడ్మిషన్లకు ఆటంకం కలుగుతుంది. ఈ విషయాన్ని స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ పలుమార్లు మధిర ఆర్టీసీ డీఎంకు వివరించడం జరిగింది.

మరమ్మతు పనులు ప్రారంభిస్తాం..



కళాశాలలో భవనాల మరమ్మతుల నిమిత్తం రూ.26 లక్షల నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. కళాశాలలో నెలకొన్న సమస్యలపై అదనపు కలెక్టర్ శ్రీజతో చర్చించాం. రెండు రోజుల్లో ఆర్టీసీ ఆర్ఎం, కలెక్టర్‌లు డీపో మేనేజర్‌లతో సమావేశం ఉంది. ఆమీటింగ్‌లో మరోసారి కళాశాలకు సమయానికి బస్సులు నడిపాల్సిందిగా కోరతాం. నూతన భవనాల నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలు ఏమీ కూడా ప్రభుత్వానికి పంపలేదు.

– రవిబాబు, డీఐఈఓ, ఖమ్మం

భయంతోనే చదువు చెబుతున్నాం..



కళాశాలలో భవనాలు శిథిలం కావడంతో నిత్యం భయం గుప్పిట్లోనే చదువులు చెబుతున్నాం. ఇటీవల క్లాస్ రూమ్‌లో పెద్ద ఎత్తున పెచ్చులూడి పడ్డాయి. ప్రమాదం తప్పింది. అడ్మిషన్ల కోసం గ్రామాల్లో తిరిగినప్పుడు పేరంట్స్ ఈ సమస్యను లేవనెత్తి తమ పిల్లలను చేర్పించేదుకు విముఖత చూపుతున్నారు. గతేడాది అధ్యాపకులం, స్థానిక దాతలు కలిసి విద్యార్థులకు మిడ్డే మీల్స్ పెట్టాం. అయినా పిల్లలు ఇష్టం చూపడం లేదు. దీనికి తోడు ఆర్టీసీ బస్సులు సమయానికి రావు.

– రవికుమార్, ప్రభుత్వ కళాశాల పిన్సిపాల్, బనిగండ్లపాడు

బస్సులు రావడం లేదు..



మాది లక్ష్మీపురం గ్రామం. కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాను. కళాశాల భవనాలు శిథిలమైయ్యాయి. వర్షం వస్తే గదుల్లో నీరు కారడంతో పాటు కళాశాల ఆవరణ మొత్తం చేరువును తలపిస్తుంది. కళాశాల నుంచి సాయంత్రం ఇంటికి వెళ్లాలంటే బస్సులు లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇక ఆటోలే దిక్కు. కళాశాలలో ఉన్న ఒక్క టాయిలెట్‌కు కూడా క్యూ కట్టాల్సి వస్తుంది. నిర్మాణంలో ఉన్న టాయిలెట్స్‌ని సత్వరమే పూర్తి చేయాలి.

– దెందుకూరి వైష్ణవి, విద్యార్థిని, లక్ష్మీపురం

ఆధునికతతో యూజీడీ నిర్మాణం

సదస్సులో పాల్గొన్న మున్సిపల్ డీఈ నరేష్ రెడ్డి, మల్లు నందిని, అఖిలపక్ష నాయకులు


పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తున్న డీఈ నరేష్ రెడ్డి, పక్కన మల్లు నందిని, అఖిలపక్ష నాయకులు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలో రూ.128కోట్లతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ(యూజీడీ) పనులు అత్యంత ఆధునిక పద్ధతుల్లో నిర్మిస్తున్నట్లు మున్సిపల్ డీఈ నరేష్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో యూజీడీ పనులపై నిర్వహిస్తున్న అవగాహన సమావేశంలో భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని పాల్గొనగా, డీఈ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి మాట్లాడారు. భవిష్యత్ తరాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క యూజీడీ పనులకు నిధులు మంజూరు చేశారని, పనులు నాణ్యతా ప్రమాణాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షపు నీరు ప్రవహించేందుకు మధిర పట్టణంలో సైడ్ కాలవల నిర్మాణానికి రూ.75 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసిందని, 10 కిలోమీటర్ల మేరకు పెద్ద కాలువలు, 19 కిలోమీటర్ల వరకు చిన్న కాలువలు నిర్మించనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ నుంచి ఒక వ్యక్తికి ప్రతిరోజు 135 లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. దీనికి అనుగుణంగానే పక్కా ప్రణాళికతో ఈ ప్రాజెక్టు డిజైన్ చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సెంట్రల్ పబ్లిక్ హెల్త్ అండ్ ఎన్విరాన్మెంట్ ఇంజనీరింగ్ ఆర్గనైజేషన్ నిబంధనల ప్రకారమే మధిర పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మిస్తున్నామన్నారు. ఇళ్లలో వాడిన మురుగునీరు, మరుగుదొడ్ల నీరు మాత్రమే 6 అంగుళాల అండర్ గ్రౌండ్ పైపుల ద్వారా మురుగునీటి శుద్ధి ప్లాంట్ కు, వర్షపు నీరు ఓపెన్ డ్రెయినేజీ సిస్టం ద్వారా వైరా నదికి తరలించడం జరుగుతుందన్నారు. అనంతరం మల్లు నందిని మాట్లాడుతూ.. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఒక పని అయిన తర్వాతే మరొక రోడ్డు పని మొదలు పెట్టాలని సూచించారు. ఇప్పటికే టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉన్న మట్టి రోడ్లలో యూజీడీ పనులు చేపట్టారని, రోడ్లు బురద కావడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సమస్య పరిష్కారానికి ఆయా రోడ్లకు కంకర లేదా గ్రావెల్ తోలాలని అధికారులకు సూచించారు. అనంతరం యూజీడీ పనులకు సంబంధించి పలువురు అడిగిన ప్రశ్నలకు డీఈ నరేష్ రెడ్డితో పాటు మల్లు నందిని సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మొండితోక సుధాకర్, శీలం నరసింహారావు, మల్లాది హనుమంతరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, కరివేద సుధాకర్, పాపినేని రామనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడికి సత్కారం


గజమాలతో సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

వైరా: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పసుమర్తి సీతాచంద్రరావును ఆదివారం ఆర్యవైశ్యులు ఘనంగా సత్కరించారు. వైరాలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం మండల మహాసభ అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, నాయకుడు వనమా విశ్వేశ్వరరావు ఘనంగా సత్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ మొదటి అధ్యక్షుడు శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు సంధ్యారాణి, వెంకటకృష్ణ, సునీత, కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, సత్యం బాబు, ప్రసాద్, వెంకటరమణ, శబరినాద్, వెంకటసుజిత్, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై దుష్ప్రచారం చేయడం సరికాదు


బోనకల్: మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజు

ఎర్రుపాలెం/బోనకల్: కేటీఆర్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేస్తే సహించేదిలేదని జెడ్పీమాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ జెడ్పీటీసీ శీలం కవిత, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం ఎర్రుపాలెం, బోనకల్‌లోని రావినూతల గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మీడియా ముసుగులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తప్పుడు ప్రకటనలు చేయడం సరైంది కాదన్నారు. మధిరలో షాడో ఎమ్మెల్యేలుగా కొందరు చెలామణీ అవుతున్నారని విమర్శించారు. పత్రికా స్వేచ్ఛ పేరుతో తప్పుడు వార్తలు రాస్తానంటే తెలంగాణా సమాజం ఊరుకోదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ మధిర మార్కెట్ చైర్మన్ శ్రీనివాసరావు, మల్లిఖార్జున్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, తిరుపతిరావు, నర్సింహారావు, నాగేశ్వరావు, మస్తాన్‌వలీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇతరులతో ప్రేమగా మెలగాలి

కల్లూరురూరల్: తోటి మానవుల పట్ల ప్రేమతో మెలగాలని పెద్దకోరుకొండి ఆర్‌సీఎం చర్చి మత గురువు వినయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మత గురువుగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఆదివారం స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు క్రైస్తవ భక్తులు శుభాకాంక్షలు తెలిపారు. పూజ కార్యక్రమాలలో క్రైస్తవ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తికి గాయాలు

బోనకల్: మండలంలోని చిరునోముల గ్రామానికి చెందిన రేగళ్ల వీరయ్య ఆదివారం చిరునోముల నుంచి బోనకల్ వస్తుండగా ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా కోటా బానుహాసన్, మిధున్ చక్రవర్తి ప్రథమ చికిత్స చేసి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆర్థిక సాయం

కల్లూరు: కల్లూరు అంబేడ్కర్‌నగర్‌లో నివాసముంటున్న సైకిల్ మెకానిక్ రాము ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై పని చేసుకోలేని స్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న అంబేడ్కర్ ఫౌండేషన్ సభ్యులు, దాతల సహకారంతో రూ.22,700నగదును బాధిత కుటుంబానికి అందించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

చింతకాని: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి గోపాలరావు, మండల కార్యదర్శి రాము, నాయకులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

సత్తుపల్లిరూరల్: జూలై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నర్సింహారావు, రావి శివరామకృష్ణ తెలిపారు. ఆదివారం సత్తుపల్లిలో నిర్వహించిన సీపీఐ పట్టణ 5వ మహాసభలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆదినారాయణ, పట్టణ కార్యదర్శి రామకృష్ణ, యోబు, సుధాకర్, రంజాన్‌బీ, రామలక్ష్మి, వెంకటేశ్వర్లు, భాస్కర్, రాజు, రామారావు, అమీద్, అజయ్ పాల్గొన్నారు.

ప్రాణాలు నిలబెట్టడంలోనే వైద్యులకు తృప్తి


వైద్య పరీక్ష చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి


డాక్టర్ లక్ష్మణ్‌సాయిని సన్మానిస్తున్న మసీద్ కమిటీ

సత్తుపల్లిటౌన్: వైద్య చికిత్స అందించి ప్రాణాలు నిలబెట్టడంలోనే వైద్యులకు సంతృప్తి లభిస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. ఆదివారం స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో.. సత్తుపల్లి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యాన, అదే విధంగా స్థానిక మసీద్ ప్రాంగణంలో సత్తుపల్లి జామె మసీద్ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. వైద్య రంగంలో సత్తుపల్లి దినదినాభివృద్ధి చెందుతుందని, అన్ని స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులోకి వచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రైవేట్, ప్రభుత్వ వైద్యులు రోగులను పరీక్షించి సుమారు లక్ష రూపాయల విలువైన మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ టి.సీతారాం, ఐఎంఏ నిర్వాహకుడు డాక్టర్ కట్టా శివాజీ, మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌కె రసూల్, ఎస్‌కె గ్రాండ్ మౌలాలీ, ఎండి కమల్‌పాషా, ఆదిల్‌షరీఫ్, మోనార్క్ రఫీ, డాక్టర్లు మౌలాలీ, అశోక్‌కుమార్, లక్ష్మణ్‌సాయి, వాసు, షాకీర్, హర్షిత్, రమేష్ చంద్ర, సత్యప్రసాద్, స్నిగ్ధ, వెంగళరావు, నవీన్, కిరణ్‌కుమార్, కిరణ్‌కుమార్, బివి రెడ్డి, సురేష్, ప్రవంతి, రమ్య, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలూ భోజనం ఎలా ఉంది..

తెలంగాణ ప్రభుత్వం డైట్ ఛార్జీలు పెంచింది. మెనూ ప్రకారం పెడుతున్నారా..? పిల్లలూ భోజనం ఎలా ఉంది..? అంటూ ఎమ్మెల్యే రాగమయి విద్యార్థులను ప్రశ్నించారు. సత్తుపల్లిలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలను ఆదివారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌బాబు, ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య, చెన్నారావు, సుజలరాణి, భరత్, దిలీప్, రాకేష్ పాల్గొన్నారు.

యూరియా, డీఏపీ విక్రయాలను నిలిపివేస్తున్నాం

చింతకాని: డీలర్లకు భారమవుతున్న యూరియా, డీఏపీ ఎరువుల విక్రయాలను నిలిపివేస్తున్నట్లు మండల ఎరువుల డీలర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల ఎరువుల డీలర్ల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. డీలర్లకు, రైతులకు భారమవుతున్న యూరియా, డీఏపీ లాంటి ఎరువుల విక్రయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని, కంపెనీలు ఇష్టానుసారంగా లింకులు పెట్టి ఎరువులను సరఫరా చేస్తుందన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఎరువుల డీలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా ఉప్పుగండ్ల రవి, ఉపాధ్యక్షుడిగా మందా గోపాలరావు ఎన్నికయ్యారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

సత్తుపల్లి: డాక్టర్స్‌డే సందర్భంగా జూలై 1న పట్టణంలోని సత్యవతి కంటి ఆస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత కంటి వైద్య శబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కట్టా శివాజీ తెలిపారు. కంటి శుక్లం ఆపరేషన్ చేయించుకునే వారికి కంటి అద్దంలో రాయితీ ఇవ్వబడుతుందని తెలిపారు. అత్యాధునిక ఫాకో సర్జరీ చేయబడుతుందని తెలిపారు.

పటిష్టమైన బీసీ కమిటీలను ఏర్పాటు చేయాలి

కల్లూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పటిష్టమైన బీసీ కమిటీలను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం కల్లూరు పట్టణంలో.. బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు బయ్యారపు నరేందర్ నివాసంలో నిర్వహించిన మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 10 నాటికి మండలంలో బీసీ కమిటీలను పూర్తి చేయాలని, బీసీల్లో సామూహిక తిరుగుబాటు వచ్చిన నాడు మాత్రమే రాజ్యాంగ బద్ధమైన హక్కులు సాధించుకోబడతాన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు, పట్టణఅధ్యక్షుడు నరేంద్ర, నరసింహారావు, కృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఏన్కూరు: ప్రైవేట్ విద్యాసంస్థలు వసూలు చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర ఆర్గనైజర్ ఇస్లావత్ చందునాయక్ అన్నారు. ఆదివారం ఏన్కూరులో ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేయక పోవడం వల్ల ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు ఇష్టానుసారం ఫీజుల వసూలు చేస్తున్నాయన్నారు. పాఠశాలలు తెరిచి నెల రోజులు కావస్తున్నా ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టలేదన్నారు.

శాకంబరీ దేవిగా అమ్మవారు

తల్లాడ: ఆషాడ మాసం శాకంబరీ ఉత్సవాల సందర్భంగా ఆదివారం తల్లాడలోని కోట మైసమ్మ తల్లి శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. ఆయల అర్చకులు కంచెల సతీష్ శర్మ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు నాలుగో రోజు అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు.

కమ్మజన సేవా సమితి కమిటీ ఎన్నిక

వైరా: మండల కేంద్రంలోని కమ్మవారి కల్యాణ మండపంలో కమ్మజన సేవా సమితి నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, కమ్మ జన సేవా సమితి ఫౌండర్ అడపా అప్పారావు, ప్రముఖ న్యాయవాది కాటమనేని రమేష్, మందడపు మధుసూధన్‌రావు ఆధ్వర్యంలో నూతన కమిటీని నిర్వహించారు. కాగా, అధ్యక్షుడిగా కట్టా కృష్ణార్జునరావు, ఉపాధ్యక్షుడిగా మేదరమెట్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా రాంబాబు, జాయింట్ సెక్రటరీగా సూర్య దేవర శ్రీధర్, కోశాధికారిగా హన్మంతరావు, గౌరవ సలహామండలి అధ్యక్షుడిగా శ్రీరామనేని రామస్వామితో పాటు మరికొంత మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆమె మరణం వృథా కానివ్వం


మొక్క నాటి, విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న గ్రామస్తులు

తల్లాడ: పది ఫలితాల్లో 510 మార్కులతో ప్రతిభ చూపిన విద్యార్థిని అయిలూరి పూజిత ఇల్లు వదిలి ఖమ్మం హాస్టల్లో ఉండటం ఇష్టం లేక ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. ఆమె మరణం వృథా కానివ్వం, ఆమెను మొక్కల రూపంలో చూసుకుంటాం అంటూ తల్లిదండ్రులు, గ్రామస్తులు, స్నేహితులు, ఉపాధ్యాయులు పూజిత పుట్టిన రోజు ఆదివారం నాడు పండ్ల మొక్కలు నాటారు. రామానుజవరం రోడ్డు పక్కన మామిడి తదితర మొక్కలను నాటారు. ముందుగా పూజిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన జ్ఞాపకార్థం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. కార్యక్రమంలో రామానుజవరం మాజీ సర్పంచ్ కోటారెడ్డి, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు శివపార్వతి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేతిపంపులకు మరమ్మతులు చేయండి


పనిచేయని బోరింగ్ వద్ద గ్రామస్తులు

ఏన్కూరు: మండలంలోని ఆరికాయలపాడులో పనిచేయని చేతి పంపులకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరారు. ఆదివారం గ్రామంలో పనిచేయని చేతిపంపు వద్ద నిరసన తెలిపి మాట్లాడారు. ప్రస్తుతం అరకొరగా మిషన్ భగీరథ నీరు రావడంతో తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడిందని, చేతిపంపులను బాగు చేసి ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

ఎన్నెస్పీ కాలువ ఆక్రమణ


వరిపాట్టుతో నిండి ఆక్రమణకు గురైన సాగర్ కాలువ

ముదిగొండ: రహదారి పక్కనే ఉన్న ఓ రైస్‌మిల్లు నిర్వాహకుడు ఎన్నెస్పీ కాలువను ఆక్రమించిన ఘటన మండలంలోని అమ్మపేటలో చోటు చేసుకుంది. కాలువ పక్కనే ఉన్న రైస్ మిల్లు, దాని నుంచి వచ్చే వరిపాట్టు కాలువలో పడి పూర్తిగా నిండిపోయింది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాలువ పిచ్చిచెట్లతో ఉండడంతో పాటు వరిపాట్టుతో నిండిపోయి, పక్కన రోడ్డుకూడా కనిపించకుండా పోయింది. దీంతో రైతులు తమపొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇకనైనా అధికారులు కాలువలోని వరిపాట్టును తొలగించి, పిచ్చిచెట్లు లేకుండా, ఆక్రమణకు గురికాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఖరీఫ్ వరినాట్లు ప్రారంభం


నాట్లు వేస్తున్న కూలీలు


నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న వరి నారు

కల్లూరురూరల్: కల్లూరు మండలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వరి నాట్లు ప్రారంభమయ్యాయి. మండలంలో సుమారు 34వేల ఎకరాల్లో వరి పండిస్తున్నారు. 90శాతం పైగా సన్న ధాన్యం పండించేదుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. చెరువు ఆయకట్టు కింద, బోర్లు ఆయకట్టు కింద వరినాట్లు ప్రారంభించారు. నాగార్జునసాగర్ నీరు జులై రెండో వారం లేక ఆగస్టు మొదటి వారంలో విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అందువల్ల నాగార్జునసాగర్ కాలువ ఆయకట్టు కింద ప్రస్తుతం వరి నాట్లు ప్రారంభం కాలేదు. గత వేసవిలో కల్లూరు మండలంలోని చెరువుల్లోకి సాగర్ నీరు విడుదల చేయటంతో చెరువులన్నీ నిండుకుండలా మారాయి. దీంతో రైతులు చెరువు ఆయకట్టుల కింద వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. సాగర్ కాలువ ఆయకట్టు, లిఫ్ట్ ఆయకట్టుల కింద ప్రస్తుతం వరి నాట్లు వేసి ఉంచారు.

సన్నధాన్యం సాగుకే రైతుల మొగ్గు..

ఈ ఖరీఫ్ సీజన్‌లో సన్నధాన్యం సాగు చేయడానికి రైతులు మొగ్గు చూపిస్తున్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.500లు బోనస్ ఇవ్వడంతో సాగు పెరిగిపోయింది. ముఖ్యంగా రైతులు బీపీటీ 5204, వరంగ్ సన్నాలు డబ్ల్యూజీఎల్ 32100, వరంగ్ సాంబ డబ్ల్యూల్ 14, జగిత్యాల సాంబ, జేజీఎల్ 3844, జేజీఎల్ 33124, హెచ్ఎంటి సోనా, ఆర్ఎస్ఆర్ 31479, ఎంటీయూ 1271 తదితర సన్న రకాలను రైతులు ఈ ఏడాది సాగు చేస్తున్నారు. సన్నధాన్యం సాగుకు రైతులకు అదనంగా ఖర్చుఅవుతుంది. చీడపీడలు, వైరస్‌లు సోకుతుంటాయి. అయినప్పటికీ ప్రభుత్వం బోనస్ వస్తుండటంతో రైతులు సన్న ధాన్యాన్ని పండించేందుకు సమయాత్తమౌతున్నారు.

పంట సాగుకోసం రైతు ఆరాటం.. ఆహారం కోసం కొంగలు వెదుకులాట..

సత్తుపల్లిరూరల్: రెండు రోజుల నుంచి సత్తుపల్లి మండలంలో జల్లులతో కూడిన వర్షాలు పడుతుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో వరిపొలంలో రైతు పంట సాగు చేసేందుకు ట్రాక్టర్‌తో దుక్కి చేస్తుండగా.. ఆహారం కోసం కొంగలు వెతుకులాట సాగిస్తూ మట్టిలో నుంచి వచ్చే పురుగులను తింటూ పొట్ట నింపుకుంటున్నాయి. కొంగలు ఒకచోట నుంచి మరోచోటుకు ఎగురుకుంటూ వెళ్తుండటంతో రైతులు, కూలీలు, రోడ్డున వెళ్లే ప్రయాణికులు ఆహ్లాదకరమైన దృష్టాన్ని చూస్తూ గడిపేశారు.


ట్రాక్టర్ దుక్కి దున్నుతుండగా కొంగలు ఎగురుతూ కనువిందు చేస్తున్న దృశ్యం